

సింహగిరికి పోటెత్తిన భక్తులు

గంధం అమావాస్య పురస్కరించుకుని సింహగిరికి భక్తులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. 10లో



ముగిసిన వారోత్సవాలు

జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. 8లో



నిబద్ధతతోనే ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట

నిషేధిత ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. 8లో

కేజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విశ్రాంతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కేజీహెచ్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. గైనిక్ వార్డులో అందుతున్న వైద్యసదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునే గదులను పరిశీలించారు. కేజీహెచ్‌లో చేపడుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.అశోక్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖలో ఐటీ పరిశోధన వర్సిటీ

- ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ వర్సిటీకి ముందడుగు
- ఆర్ఎఫ్‌పీ పిలిచిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్
- ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధికి ప్రణాళికలు
- మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సహకారం



సాక్షి, విశాఖపట్నం: ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖపట్నంను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ఆలోచనలతో అడుగులు వేస్తోంది. ఓవైపు బీచ్ ఐటీ ప్రమోషన్‌తో సంస్థలను ఆకర్షిస్తున్న ప్రభుత్వం.. తాజాగా ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీని విశాఖలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల సహకారంతో టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ.. అవసరమైన మానవ వనరుల అభివృద్ధికి అనుగుణంగా ఈ యూనివర్సిటీ రాబోతోంది. ఇందుకు సంబంధించి ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ విభాగం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)ను పిలిచింది.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థను డిజిటలైజేషన్ నడిపిస్తోంది. జీవితంలో రోజువారీ అంశాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగం గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలన్నీ భారత్ వైపు అడుగులు వేస్తున్నాయి. గ్లోబల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దేశాల్లో భారత్, యూరప్ మొదట్లో ఉండగా.. తాజాగా రాష్ట్రాల జాబితాలో ఏపీ కూడా చేరిన విషయం విదితమే. ఉద్యోగ అవకాశాలను సృష్టించడంలో ఐటీ రంగం కీలకపాత్ర పోషిస్తోంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీలు(నాస్కామ్) నివేదిక ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత ఐటీ సెక్టార్ మొత్తం రెవెన్యూ 227 బిలియన్ డాలర్లు. ఇందులో 178 కోట్ల బిలియన్ డాలర్లు సాఫ్ట్‌వేర్ ఎగుమతులుండటం గమనార్హం. దేశంలో ప్రస్తుతం 5జీ, కృత్రిమ మేధ, బ్లాక్ చెయిన్, ఏఆర్, వీఆర్, మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, రోబోట్స్ తదితర అధునాతన సాంకేతికత వైపు పరుగులు పెడుతున్న తరుణంలో.. మానవ వనరుల అవసరం ఎంతో ఉంది. భవిష్యత్‌లో దేశ వృద్ధి రేటుపై ఇవన్నీ ప్రభావం చూపే అవకాశాలున్నాయని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఐటీకి మిగతా 8వ పేజీలో ▸

26న జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాల అమలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ నెల 26న జిల్లా సమీక్ష కమిటీ సమావేశం(డీఆర్‌సీ) నిర్వహించనున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగే డీఆర్‌సీకి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర అధికారులు హాజరుకానున్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న పనులు, ఇతర సమస్యలపై ముందుగా సమావేశంలో చర్చించనున్నారు. అనంతరం ఇళ్ల పట్టాలకు సంబంధించి జీవో నం.71, 72, 36/84, 60ల్లో పొందుపరిచిన అంశాలు, గాజువాక ఇళ్లపట్టాలు, యూఎల్‌సీ రెగ్యులరైజేషన్ తదితర అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. వీటితో పాటు నేరనియంత్రణ, వైద్యం, ఆరోగ్యం, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, కేజీహెచ్ ఆధునికీకరణ, నాడు–నేడు పనులు, ప్రాధాన్యం భవనాల నిర్మాణం మొదలైన అంశాల అజెండాతో డీఆర్‌సీ సమావేశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశ నిర్వహణ ఏర్పాట్లను డీఆర్‌వో శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. డీఆర్సీ సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా విభాగాలకు సంబంధించిన ప్రగతి నివేదికలు, గత డీఆర్‌సీ సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి సంబంధించిన పురోగతితో కూడిన నివేదికలను రెండు రోజుల్లో అందజేయాలని కలెక్టర్ సూచించారు.



అక్షయ తృతీయ.. 'నగ'ధగలు

అమ్మకాలు పుంజుకుంటాయని వర్తకుల ఆశాభావం

మహారాణిపేట: అక్షయ తృతీయ హిందువులకు పవిత్రమైన రోజు. వైశాఖ మాసం శుక్ల పక్ష తృతీయ నాడు అక్షయ తృతీయగా జరుపుకుంటారు. అక్షయ అంటే ఎప్పటికీ తరగనిది అని అర్థం. శివపురాణం ప్రకారం.. సిరి సంపదలకు అధిపతి అయిన కుబేరుడు పరమేశ్వరుడినిప్రార్థించగా అక్షయ తృతీయ రోజున లక్ష్మీ అనుగ్రహాన్ని ఇచ్చిన్నట్లు చెబుతారు. అందుకే ఈ రోజున బంగారం కొంటే అంతులేని సిరి సంపదలు కలుగుతాయని భావిస్తారు. రెండేళ్ల కోవిడ్ సంబంధిత అవాంతరాలు, గతేడాది ఓ మాదిరిగా అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అక్షయ తృతీయపై వ్యాపారులు పూర్తి ఆశావహ దృక్పథంతో ఉన్నారు. ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా పెరుగుతున్నందున అమ్మకాలు గతం కంటే అధిగమిస్తాయని ఆశిస్తున్నారు. ఇటీవల పెరిగిన బంగారం ధరలు అడ్డంకిగా మారవచ్చని కూడా కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.60,930, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55,850 వద్ద ఉన్న సంగతి తెలిసిందే. విశాఖ జిల్లాలో సుమారు 200 వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. జగదాంబ, జడ్జి కోర్టు, కురుపాం మార్కెట్, ద్వారకానగర్, సంపత్ వినాయనగర్ రోడ్డు, గోపాలపట్నం, మద్దిలపాలెం, కంచరపాలెం, గాజువాక, మధురవాడ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ షాపులతో పాటు స్థానిక వర్తకులు బంగారు దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 22వ తేదీన అక్షయ తృతీయ నేపథ్యంలో బంగారు దుకాణాలను అలంకరించారు. వివిధ మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచడంతో పాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించారు. ప్రతి గ్రాముపై తగ్గింపు ధరలు, తరుగులో తగ్గింపు ఇస్తున్నారు.

కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే బంగారం కొనే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి బంగారు వస్తువులు, ఆభరణాలు కొనుగోలుకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ) లేకుండా బంగారు ఆభరణాలు విక్రయించడాన్ని నిషేధించింది.



ఆశాభావంతో ఉన్నాం



అక్షయ తృతీయ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. వివిధ రకాల మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచాం. ముఖ్యంగా మహిళల కోసం సరికొత్త డిజైన్లు షాపులో కొలువుదీరాయి. ఈ ఏడాది బంగారం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని ఆశాభావంతో ఉన్నాం.

– మంచుకొండ అప్పలరాజు శ్రీరంగ

అంతా మంచే జరుగుతుంది



అక్షయ తృతీయ అత్యంత పవిత్రమైనది. ఈ రోజున బంగారం కొనడం వల్ల ఐశ్వర్యం, అదృష్టం కలుగుతుందని నమ్మకం. మా కొనుగోలుదారుల కోసం అవసరమైన వెరైటీలతో బంగారు ఆభరణాలు సిద్ధంగా ఉంచాం. ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాం.

– వైశ్యరాజు భద్రగిరిరాజు

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

అల్లిపురం: జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా పాకల జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి కె.అనురాగ్ అలియాస్ కె.అనూష విశాఖలోని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు(రైల్వే న్యాయస్థానం) న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి సిహెచ్.శ్రీనివాసబాబు కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.గంగా భవాని బదిలీపై విశాఖలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి జి.సాయికృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

పూర్ణామార్కెట్ ఆశీల వేలం పాట రూ.62.56లక్షలు

జగదాంబ: ఎట్టకేలకు పూర్ణామార్కెట్ ఆశీల వేలం పాట ఖరారైంది. ఆరుసార్లు వాయిదా పడుతూ వచ్చిన వేలం పాట.. గురువారం జోన్-4 కార్యాలయంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్ మరోసారి నిర్వహించారు. కాంట్రాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్ 2023-24 సంవత్సరానికి రూ.62.56 లక్షలకు పాటను దక్కించుకున్నారు. అలాగే రామకృష్ణ రైతుబజార్‌ను కాంట్రాక్టర్ జి.గణేష్ రూ.15.50 లక్షలకు వేలం పాట పాడారు. రెండేళ్లుగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. జీవీఎంసీ సిబ్బంది ఆశీలు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వేలం పాట ఖరారు కావడంతో వారికి ఊరట కలగనుంది.

4 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో గురువారం నాలుగు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 301 మందికి పరీక్షలు నిర్వహించగా.. వీరిలో నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 36కి చేరుకుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 35 మంది హోం ఐసోలేషన్‌లో, ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. కేజీహెచ్ ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్యం కుదుటపడింది. బాలికకు ఆర్‌టీపీసీఆర్‌లో నెగిటివ్ రావడంతో పిల్లల వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ వానపల్లి శైలజ అన్నారు. డ్రాపవుట్ నివారణ, చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల నమోదుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం సమగ్ర శిక్ష కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. నగరంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోలో సవ్యంగా నమోదు చేయటం లేదని గుర్తించామన్నారు. అలాంటి పాఠశాలల్లో తమ బృందాలు పర్యటించి, అందుకు గల కారణాలపై యాజమాన్యాల నుంచి వివరణ కోరుతామన్నారు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరేటప్పుడు యాజమాన్యాల వారు విధిగా సరైన కారణాలతో డ్రాప్ బాక్స్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. చైల్డ్ ట్రాకింగ్ సమయంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే సిబ్బందికి యాజమాన్యాలు సహకరించాలన్నారు. చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తేనే, అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

అల్లిపురం: జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. నోవాటెల్ హోటల్‌లో అగ్నిమాపక శాఖ సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు హోటల్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా హోటళ్లు, పరిశ్రమల్లో సిబ్బందితో పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామన్నారు. ప్రమాదాల నియంత్రణకు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విన్యాసాల్లో భాగంగా వాటర్ స్ప్రింక్లర్‌తో మంటలను అదుపు చేయడం, సిలిండర్‌కు మంటలు వ్యాపించినపుడు.. ఎగ్జాస్టర్స్‌తో ఎలా నియంత్రించవచ్చు తదితర అంశాలపై హోటల్‌కు చెందిన వివిధ విభాగాల సిబ్బందికి వివరించారు. హోటల్ సెక్యూరిటీ మేనేజర్ దేవరాజ్ చౌదరి, ఏడీఎఫ్‌వోలు ఆర్.వి.రమణ, వి.సుబ్బారావు పాల్గొన్నారు.



మంటలు అదుపు చేయడంపై మహిళా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్‌కు పాన్ తప్పనిసరి

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ



మాట్లాడుతున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, ఐటీ అధికారి భావనారాయణ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయపు పన్ను ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్ (ఎస్ఎఫ్‌టీ) దాఖలు చేసేటప్పుడు రూ.10 లక్షలు పైబడిన ప్రతి లావాదేవీకి కచ్చితంగా పాన్ నంబర్ అవసరమని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.బాలకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఎస్ఎఫ్‌టీ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జిల్లా రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖ సూచనల మేరకు ఎస్ఎఫ్‌టీ పొందుపరిచే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఐటీ శాఖ ఇంటిలిజెన్స్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అధికారి ఎంవీఎస్ఎస్ భావనారాయణ మాట్లాడుతూ స్థిరాస్తుల విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రూ.30 లక్షలు విలువ మించిన లావాదేవీల సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. వీటికి సంబంధించిన స్టేట్‌మెంట్స్ ఫైల్ చేసేందుకు మే 31వ తేదీ తుది గడువు అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గంగా పుష్కరాల కోసం మరో ప్రత్యేక వీక్లీ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న గంగా పుష్కరాలను పురస్కరించుకొని యాత్రికుల కోసం గుంటూరు-వారణాసి-గుంటూరు(వయా దువ్వాడ మీదుగా) మరో వీక్లీ స్పెషల్ నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. గుంటూరు-వారణాసి(07230) వీక్లీ స్పెషల్ గుంటూరులో ప్రతీ శనివారం రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి ప్రతీ సోమవారాలలో సాయంత్రం 4.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 22, 29, మే 6వ తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో బనారస్-గుంటూరు (07229) వీక్లీ స్పెషల్ బనరాస్‌లో ప్రతీ సోమవారం సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45గంలకు బయల్దేరి బుధవారం ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ ఈనెల 24, మే1, 8 తేదీల్లో నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఇరుమార్గాలలో విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, రాయగడ, మునిగుడ, టిట్లాఘడ్, బాలంగీర్, బర్‌ఘడ్ రోడ్, సంబల్‌పూర్, జార్సుగుడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, మార్‌కకనా, లతేహార్, డాల్టన్ గంజ్, గార్వారోడ్, డెహ్రీఆన్‌సన్, ససరం, బాభువ రోడ్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్‌లలో ఆగుతాయి.

నేడు ఆస్కార్ ఫిల్మ్ ఫెస్టివల్

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభ సభ అనంతరం ఆస్కార్ బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఎలిఫెంట్ విస్పర్స్', ఆస్కార్ అవార్డు పొందిన బెస్ట్ ఒరిజనల్ సాంగ్ 'నాటు నాటు పాట' ప్రదర్శిస్తామని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సామగ్రి సిద్ధం

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సైతం విద్యాశాఖాధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన సామగ్రి నగరంలోని క్వీన్ మేరీ పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు గురువారం చేరుకుంది. ప్రత్యేక వాహనంలో వీటిని సరఫరా చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. ఈ నెల 26 నాటికి మూల్యాంకనం ప్రక్రియ పూర్తికానుంది. మే రెండో వారంలో ఫలితాలు విడుదల చేసి, అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు.

విశాఖలో ఐటీ పరిశోధన వర్సిటీ

► 7వ పేజీ తరువాయి

సంబంధించిన మానవ వనరుల అభివృద్ధి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ప్రపంచస్థాయి ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీస్ రీసెర్చ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

మసాచుసెట్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో..

ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో సంయుక్త సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారులతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రముఖ విశ్వవిద్యాలయాలను ఈ రీసెర్చ్ యూనివర్సిటీలో భాగస్వామ్యం చేయనున్నారు. నిధుల కోసం ఉత్తమ ప్రైవేట్ భాగస్వాములను ఆకర్షించేందుకు ఈ కమిటీ కృషి చేయనుంది. వివిధ పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుని కాన్సెప్ట్ ప్లాన్‌ను సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం కన్సల్టెన్సీని ఏర్పాటు చేసి.. దాని ద్వారా యూనివర్సిటీ అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్లానింగ్‌ను తయారు చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆర్ఎఫ్‌పీని పిలిచింది.

మూడు దశల్లో యూనివర్సిటీ అభివృద్ధి

యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన కన్సల్టింగ్ సంస్థను నియమించనున్నారు. యూనివర్సిటీ నిర్మాణం, అడ్మినిస్ట్రేషన్, ప్రోగ్రామ్ ఆఫర్లు, బోధనాశాస్త్రం, భాగస్వామ్య నమూనాలు, వ్యయ అంచనాలు, నిధుల సేకరణ వ్యూహం, స్వీయ-నిరంతర ఆపరేటింగ్ మోడల్‌తో సహా ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిపాదిత విశ్వవిద్యాలయం విశాఖలో ఏర్పాటు కాబోతోంది. దీంతో పాటు విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ వెంటనే అందేలా సంబంధిత పారిశ్రామిక స్పాన్సర్‌లను కూడా నియమించనున్నారు. ఫేజ్-1లో భాగంగా రెండేళ్లలో యూనివర్సిటీ నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఫేజ్-2లో భాగంగా మూడేళ్ల కాలానికి విద్యార్థులకు ఎమర్జింగ్ టెక్నాలజీపై పూర్తిస్థాయి సుశిక్షితులను చేయనున్నారు. అధ్యయన రంగాలు, ప్రోగ్రామ్ ఆఫర్‌లు, ఫ్యాకల్టీ సోర్సింగ్, విదేశీ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం, పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించనున్నారు. పెట్టుబడులను ఆకర్షించడానికి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను రూపొందించే ప్రక్రియని ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ పర్యవేక్షించనుంది. ఈ యూనివర్సిటీపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ.. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు వివిధ ప్రాంతాల్లో సమావేశాలు, సదస్సులు, ఈవెంట్లు, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించనుంది. ఈ నెలాఖరులోగా ఆర్ఎఫ్‌పీ టెండర్లు ఖరారు చేయనున్నారు.



మసాచుసెట్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్

కేజీహెచ్‌లో ఇంటి దొంగలు

వైద్యురాలి గాజుల చోరీ

డాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో ఇంటి దొంగలు పెరిగిపోతున్నారు. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు దొంగలించేస్తున్నారు. చాలా కాలంగా ఈ తంతు కొనసాగుతూనే ఉంది. కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు విలువైన వస్తువులు పోగొట్టుకుంటున్నా.. మిన్నకుండిపోతున్నారు. తాజాగా గైనకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబేదాకు చెందిన రెండు తులాల బంగారు గాజులను ఎవరో దొంగలించేశారు. గర్భిణికి శస్త్ర చికిత్స చేసే క్రమంలో ఆమె తన గాజులను ఆపరేషన్ థియేటర్‌లోని టేబుల్‌పై పెట్టారు. తర్వాత చూస్తే అవి కనిపించకపోవడంతో.. కేజీహెచ్ సూపరింటెండెంట్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. సూపరింటెండెంట్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. నేర విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాధారణంగా ఆపరేషన్ థియేటర్‌లోకి సామాన్యులను అనుమతించారు. వైద్యులు, శస్త్రచికిత్స చేసే సిబ్బందికి మాత్రమే థియేటర్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. అటువంటిది అక్కడ బంగారు గాజులు చోరీకి గురయ్యాయంటే.. ముమ్మాటికీ ఇంటి దొంగల పనే అని పోలీసులు భావిస్తున్నారు.

ఏ ఉద్యోగి పట్ల వివక్ష లేదు

వాల్తేర్ సీనియర్ డీసీఎం త్రిపాఠి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏ ఒక్క ఉద్యోగి పట్ల అధికారులెవరూ వివక్ష చూపడం లేదని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. వాల్తేర్ డివిజన్ గురించి ఏ మాత్రం అవగాహన లేని చిట్టిరాజు అనే వ్యక్తి చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. తప్పుడు పనులు చేసే వారు, అవినీతి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కుల, మత, ర్యాంక్, క్యాడర్, లింగ వివక్ష లేని పరిపాలన దక్షత కలిగిన అధికారులు ఇక్కడ పనిచేస్తున్నారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ అత్యుత్తమ పనితీరుతో ముందుకు సాగుతోందని.. ఈ పరిస్థితుల్లో కొందరు డివిజన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

నిబద్ధతతోనే ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట

- ప్రత్యామ్నాయ వస్తువులు వాడేలా అవగాహన
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నిషేధిత ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ప్లాస్టిక్ వాడకం పెరుగుతోందని, నిబద్ధతతోనే ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట వేయగలమన్నారు.నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, ఆ వ్యర్థాలను నేరుగా కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలు, లే అవుట్లలో మొక్కల పెంపకం చేపట్టాలని హార్టీకల్చర్ విభాగం అధికారులకు సూచించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన పట్టణ ప్రణాళిక అధికారి సునీత, హార్టీకల్చర్ డీడీ ఎం.దామోదరరావు, యూసీడీ పీడీ పాపునాయుడు, డీసీపీలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్లు, వార్డు ప్రత్యేకాధికారులదేనని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, వార్డు ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. వార్డు ప్రత్యేకాధికారులు ప్రతీ సచివాలయాన్ని సందర్శించి.. కార్యదర్శులు, వలంటీర్ల పనితీరును పరిశీలించాలన్నారు. 80 ఆధార్ సెంటర్లున్నాయని, అక్కడ అందించే సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రజల అర్జీలను నిర్ణీత సమయానికే పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్లు, యూసీడీ అధికారులతో సమన్వయం చేసుకుని టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు తెరవడం, మ్యాపింగ్, జియో ట్యాగింగ్ తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రౌడ్ ఫండింగ్‌కు అంగీకరించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తలపెట్టిన ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు ప్రజల నుంచి విరాళాల సేకరణ (క్రౌడ్ ఫండింగ్)కు అంగీకరించాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి లేఖ అందజేశారు. ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన ఈవోఐకు లక్ష్మీనారాయణ ప్రైవేటు సంస్థ ద్వారా బిడ్ వేసిన సంగతి విదితమే. స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన వర్కింగ్ క్యాపిటల్‌ను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బ్యాంక్ అకౌంట్‌కు పంపాలని ప్రజలను కోరాలని అనుకుంటున్నామన్నారు. ఇటీవల అయోధ్య రామమందిరం నిర్మాణం కూడా క్రౌడ్ ఫండింగ్ ద్వారా జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విధమైన క్రౌడ్ ఫండింగ్‌ను ఉక్కు యాజమాన్యం అంగీకరిస్తుందా, అయితే దానికి సంబంధించిన పద్ధతులను తెలియజేయాలని కోరారు.

డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్(డీఈఐ)లో డిప్లమో ఇన్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్ కోర్సులో చేరడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి తెలిపారు. ఇది మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సు అని..10వ తరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఈ ఏడాది ఎస్ఎస్‌సీ పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకుంటే.. 9వ తరగతి మార్కుల జాబితా జత చేయవచ్చన్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు 22 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 25 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99633 40611లో సంప్రదించవచ్చు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతా కారణాల వల్ల కిరండూల్‌లో లైన్‌లో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎంత్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన బయల్దేరే విశాఖపట్నం- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీన దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖపట్నం-కిరండూల్ (08551) స్పెషల్ పాసింజర్ ఈనెల 22న దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్ - విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈనెల 23వ తేదీన దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.